

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట

గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



సాగర తీరంలో సాగు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు భూముల్లో యాసంగిలో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

31.0 /18.3

పొగమంచు కురుస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాత్కాలికంగా నిలిచిన సదరం సేవలు

- సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్న ప్రభుత్వం
- ఆలస్యం కానున్న స్లాట్ బుకింగ్

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా సదరం సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. తద్వారా జనవరి 1న ప్రారంభం కావాల్సిన స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో మీ–సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌ల కోసం దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని దివ్యాంగులకు వైకల్యాన్ని నిర్ధారించి సర్టిఫికెట్లను జారీ చేయడానికి ప్రభుత్వం ప్రతీ మూడు నెలలకోసారి సదరం క్యాంపులను ఏర్పాటు చేస్తోంది. నెలకు మూడు చొప్పున మూడు నెలలకు కలిపి తొమ్మిది క్యాంపులను నిజామాబాద్ జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఒక్కో క్యాంపులో 80 మందికి వైద్యులతో పరీక్షలు చేయిస్తారు. గతంలో సెప్టెంబర్‌లో స్లాట్ బుకింగ్‌లు ప్రారంభించగా, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో కేటాయించిన తేదీలకు ఒక్క రోజులోనే స్లాట్లు బుక్కయ్యాయి. దీంతో స్లాట్లకు డిమాండ్ ఏర్పడింది. అయితే, మళ్లీ జనవరి మొదటి వారంలోనే స్లాట్ బుకింగ్‌కు తేదీలు ఖరారు చేసి ప్రారంభించాల్సి ఉంది. కానీ, సదరం సైట్‌లో విభాగాలను పెంచి అప్‌డేట్ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో కేవలం ఐదు కేటగిరీలకు మాత్రమే స్లాట్లు బుక్ చేసే అవకాశం ఉండగా, దీనిని 21 కేటగిరీలకు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తలసేమియా, క్యాన్సర్, బోన్‌మ్యారో, తదితర విభాగాలను సదరం స్లాట్ సైట్‌లో చేర్చనుంది. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీఏ పింఛన్ విభాగం డీపీఎం రాచయ్య 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వ అనుమతి రాగానే ప్రకటన జారీ చేస్తామని, అప్పుడు మీ సేవ కేంద్రాల్లో స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

ఏసీడీ చార్జీలు ఇళ్ల యజమానులే చెల్లించాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ బిల్లులో వస్తున్న 'ఏసీడీ'ని ఇంటి యజమానులు చెల్లించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి(టీఎస్‌ఈఆర్‌సీ) నిబంధనల ప్రకారం వినియోగదారులు ఏడాదిలో వాడుకున్న యూనిట్ల సరాసరి నెలకు లెక్కించి అదనపు వినియోగ డిపాజిట్లు(ఏసీడీ) విధిస్తున్నామని తెలిపారు. దీనిని ఫిబ్రవరి బిల్లుతో పాటు చెల్లించాలన్నారు. వినియోగదారులు సర్వీసు తీసుకున్నప్పుడు కిలోవాట్ లోడ్‌కు రూ. 200 సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ)గా ఇచ్చారని, తర్వాత వారు వాడుకునే యూనిట్ల సరాసరి ఆధారంగా ఏసీడీ లెక్కించి అందులో నుంచి వినియోగదారుడు చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్‌ను మినహాయించి నికర మొత్తాన్ని బిల్లులో ఏసీడీగా చూపించామన్నారు. ఏసీడీ అనేది వినియోగదారుల సర్వీస్ నంబర్‌పై డిపాజిట్‌గా ఉంచుతామన్నారు. దీనిపై ఏడాదికోసారి ఆర్‌బీఐ నిర్ణయించిన వడ్డీ రేట్ల ప్రకారం వడ్డీని లెక్కకట్టి వినియోగదారుల బిల్లులో జమ చేస్తామన్నారు. వినియోగదారులు తమ సర్వీసును రద్దు చేసుకుంటే ఏసీడీ తిరిగి చెల్లిస్తామన్నారు.

ఏసీబీ అధికారుల వేధింపులపై కేటీఆర్‌కు ట్విట్టర్‌లో ఫిర్యాదు


ఖలీల్‌వాడి: ఏసీబీ అధికారులు వేధిస్తున్నారని మాజీ సీఐ ఇందూర్ జగదీష్ ట్విట్టర్ ద్వారా ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు, సీఎంవోకి ఫిర్యాదు చేశారు. కామారెడ్డిలో రెండేళ్ల క్రితం ఐపీఎల్ బెట్టింగ్‌లో లంచం తీసుకున్నారనే అవినీతి ఆరోపణలు రావడంతో సీఐ జగదీష్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో సీఐ జగదీష్ కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఎలాంటి ఆధారాలు లేవని సస్పెన్షన్ ఎత్తివేసినట్లు సీఐ పేర్కొన్నారు. కోర్టు తీర్పు వచ్చిందని తెలిపిన తర్వాత జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్ ఫేజ్–2లోని సీఐ ఇంట్లో మళ్లీ ఏసీబీ అధికారులు వివరాలు సేకరించారు. కేసులో ఏసీబీకి చెందిన ఇద్దరు అధికారులు తనను వేధిస్తున్నారని ట్విట్టర్‌లో పోస్టు చేయడం కలకలం రేపుతోంది.

ఖమ్మం సభకు జిల్లా నుంచి 200 మంది పోలీసులు

ఖలీల్‌వాడి: ఖమ్మం జిల్లాలో బుధవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సభకు జిల్లా నుంచి 200 మంది పోలీసులు బందోబస్తుకు వెళ్లారు. ఇందులో ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఖమ్మంలో జరిగే సభకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్‌లతో పాటు యూపీ సీఎం అఖిలేష్ యాదవ్ రానుండడంతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. దీంతో నిజామాబాద్ నుంచి పోలీసులు బందోబస్తుకు వెళ్లారు.

ఎంఐఎం → ఎంబీటీ పోటీకి సన్నద్ధం..!

మైనారిటీ వర్గాల ఓటు బ్యాంకు గణనీయంగా ఉన్న ఉమ్మడి జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో ఈసారి ఎంఐఎం, ఎంబీటీ పార్టీలు పోటీకి సిద్ధమవుతున్నాయి. ఖచ్చితంగా ఎన్నికల బరిలో ఉంటామని ఇప్పటికే ఎంబీటీ ప్రకటించింది.ఆ దిశగా రాజకీయ పరిణామాలు మారనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూడ్రోజు క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎంబీటీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ప్రారంభించారు.





నిజామాబాద్‌లో ఎంబీటీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం(ఫైల్)

- నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి అసెంబ్లీ సీట్లపై గురి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు నష్టం జరిగే అవకాశం
- ఇటీవల నిజామాబాద్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభించిన ఎంబీటీ
- ఇటీవల ఏఐఎంఐఎం నుంచి ఎంబీటీలో పలువురి చేరిక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఆయా పార్టీలు కార్యకలాపాలను విస్తృతం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉండనున్న నేపథ్యంలో జిల్లాలో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహుముఖ పోటీ నెలకొనే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో ఏఐఎంఐఎం (ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్), ఎంబీటీ(మజ్లిస్ బచావో తెహ్రిక్) పార్టీలు పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా రాజకీయ పరిణామాలు మారనున్నట్లు పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిజామాబాద్ నగరపాలక సంస్థలో ఏఐఎంఐఎం 16 డివిజన్లు, బోధన్ మున్సిపాలిటీలో 11 డివిజన్లు, ఆర్మూర్ మున్సిపాలిటీలో 1 డివిజన్ గెలుచుకుంది. నిజామాబాద్ నగర పాలక సంస్థలో గత ఎన్నికల్లో బీజేపీ 28 డివిజన్లు గెలుచుకోగా, బీఆర్‌ఎస్ కేవలం 13 డివిజన్లు మాత్రమే గెలిచింది. దీంతో ఏఐఎంఐఎంకు డిప్యూటీ మేయర్ ఇచ్చి బీఆర్‌ఎస్ మేయర్ స్థానం దక్కించుకుంది. కాగా వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి అసెంబ్లీ స్థానాల్లో ఏఐఎంఐఎం పోటీ చేస్తుందని తెలుస్తుండగా, మరోవైపు తమ పార్టీ మాత్రం కచ్చితంగా బరిలోకి దిగనున్నట్లు ఎంబీటీ ప్రకటించింది. ఏఐఎంఐఎం, బీజేపీ చెప్పినట్లు వింటోందని, అందుకే తమ పార్టీ సీరియస్‌గా పోటీలో ఉంటుందని ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ స్పష్టం చేయడం గమనార్హం. మూడు రోజుల క్రితం అంజదుల్లాఖాన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎంబీటీ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. అంజదుల్లాఖాన్ సోదరుడు ఫర్హాతుల్లాఖాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా, వీళ్ల తండ్రి అమానుల్లాఖాన్ హైదరాబాద్‌లో గతంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. కాగా నిజామాబాద్ ఏఐఎంఐఎంకు చెందిన పలువురు ఇటీవల హైదరాబాద్ వెళ్లి ఎంబీటీలో చేరారు. చేరినవారిలో జహీరుద్దీన్, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు జావీద్, గత 20 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాకు ఏఐఎంఐఎం అధ్యక్షుడిగా షకీల్ అహ్మద్ ఫాజిల్ ఉన్నారు. ఎంబీటీకి జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్ సాజిద్, నగర అధ్యక్షుడిగా మహ్మద్ బాసిత్ ఉన్నారు.

43 శాతం ముస్లిం ఓట్లు..

నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల్లో ముస్లిం మైనారిటీల ఓట్లు 43 శాతం పైగా ఉన్నాయి. వీరిలో అధికశాతం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవడంతో గత రెండుసార్లు ఆ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. అయితే ఈసారి ఏఐఎంఐఎం బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పలువురు ఈ పార్టీ టిక్కెట్టును ఆశిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి టిక్కెట్టు ఆశిస్తున్న వారిలో నిజామాబాద్ నగర డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, యాకుత్‌పురా సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రి లలో ఒకరు బరిలో ఉండే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా నాన్ మైనారిటీకి చెందిన జర్నలిస్ట్ నాయకుడు బొబ్బిలి నర్సయ్య ఏఐఎంఐఎం టిక్కెట్టు ఆశిస్తుండడం గమనార్హం. ఈ టిక్కెట్టుపై పోటీ చేస్తే ముస్లిం మైనారిటీ ఓట్లతో పాటు తన సామాజిక వర్గమైన మున్నూరుకాపు ఓట్లు సాధించవచ్చనే ఆలోచనతో బొబ్బిలి నర్సయ్య ఈ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తుండడం విశేషం. ఇక బోధన్ నుంచి ఏఐఎంఐఎం టిక్కెట్టును వ్యాపారస్తుడు ముషీర్‌బాబా ఆశిస్తున్నారు. అలాగే భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ జాబేర్ సైతం టిక్కెట్టు రేసులో ఉన్నారు. ఇదిలా ఉండగా బీజేపీతో లోపాయికారీ ఒప్పందం మేరకు ఏఐఎంఐఎం పనిచేస్తోందని ఆరోపణలు చేస్తున్న ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ నిజామాబాద్ అర్బన్ లేదా బోధన్ నుంచి బరిలో ఉండనున్నట్లు సమాచారం. మొత్తం మీద ఏఐఎంఐఎం నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి, బాల్కొండ నియోజకవర్గాల్లో, ఎంబీటీ నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ రెండు పార్టీలు లేదా ఈ రెండింటిలో ఒక పార్టీ ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెడితే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు నష్టం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

4 రోజులు.. రూ. 4 కోట్లు

- ఆర్టీసీకి కలిసొచ్చిన సంక్రాంతి పండుగ
- భారీగా సమకూరిన ఆదాయం
- 12న అత్యధికంగా రూ. 1.16 కోట్లు



ఖలీల్‌వాడి: సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి ఆర్టీసీ భారీగా ఆదాయం గడించింది. గతేడాది కంటే ఈ యేడు రాబడి మెరుగుపడినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరాలు, పట్టణాల్లో ఉన్న ప్రజలు పల్లెబాట పట్టారు. నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఆరు డిపోల నుంచి ఈ నెల 7 నుంచి 17 వరకు రోజు వారి బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులను నడిపారు. పండుగకు హైదరాబాద్ నుంచి పల్లెలకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆర్టీసీకి పండుగ సీజన్‌లో భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రూ. 3.99 కోట్ల రాబడి వచ్చింది. అంతేకాకుండా పండుగ తర్వాత ప్రజలంతా తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో మరో రెండు రోజుల పాటు బస్సులు రద్దీగానే ఉండనున్నాయి. దీంతో మరింత ఆదాయం రానుంది.

తేది	ఆదాయం (రూ. కోట్లు)	ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)
11	0.98	64.23
12	1.16	74.73
13	1.07	68.59
14	0.78	61.97

ఎమ్మెల్యే షకీల్‌ది రూ. 100కోట్ల అవినీతి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

- రైస్‌మిల్లుల అక్రమాలపై విచారణ జరపాలి
- డీఎస్‌వో అత్యంత అవినీతి పరుడు
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: ఎమ్మెల్యే షకీల్ బినామీ పేర్లపై నడుపుతున్న రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా చేసి మహారాష్ట్రకు రూ. 100 కోట్లకు అమ్ముకున్నాడని.. దీనిపై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే అధికారికంగా నాలుగు రైస్ మిల్లులను నడుపుతూ బినామీల పేరుతో అనధికారికంగా మరికొన్ని రైస్‌మిల్లులను లీజ్‌కు తీసుకొని నడుపుతున్నారన్నారు. ఇందులో కొన్ని మిల్లుల్లో సరైన యంత్రాలు కూడా లేవని పేర్కొన్నారు. డీఎస్‌వో ఎమ్మెల్యే షకీల్‌తో కుమ్మక్కై ఆయన రైస్ మిల్లులకు కెపాసిటీతో సంబంధం లేకుండా.. మిషనరీ సరిగ్గా లేకున్నా 5,22,344 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించారని ఆరోపించారు. ఎమ్మెల్యే మూడేళ్లుగా తన రైస్ మిల్లులకు కేటాయించిన వడ్లను బియ్యంగా చేసి తిరిగి ఇవ్వకుండా వడ్లను మహారాష్ట్రకు అమ్ముకుని సుమారు రూ. 100కోట్ల అవినీతికి పాల్పడ్డారనేది నిజమన్నారు. 1,48,502 క్వింటాళ్ల ధాన్యాన్ని కేవలం ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన నాలుగు సొంత రైస్‌మిల్లులకే కేటాయించారని తెలిపారు. వీటిపై కలెక్టర్ స్పందించి ఏ రైస్‌మిల్లుకు ఎంత ధాన్యాన్ని కేటాయించారో, తిరిగి వాళ్లు బియ్యాన్ని ఎంత ఇచ్చారనేది శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లుల్లో జరిగిన అవినీతిపై ఉన్నతస్థాయి కమిటీ ద్వారా గాని, సీబీ సీఐడీ ద్వారా గాని నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, నేతలు రాజా నరేంద్ర గౌడ్, జావిద్ అక్రమ్, రామర్తి గోపి, ప్రమోద్, కైసర్, నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా!



న్యాల్‌కల్ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణ పనులు



తెలంగాణ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో సర్వే నంబర్ 1687లో ప్రభుత్వ భూమిగా చూపిస్తున్న రికార్డు

- నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో 800 గజాలు..
- రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి అమ్మకాలు
- ఇక్కడ గజం విలువ రూ. 35 వేలు
- హరితహారం మొక్కలు తొలగించి నిర్మాణం

నిజామాబాద్ నాగారం : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు గురవుతోంది. అందులో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. ఇదే తరహాలో నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో రూ. కోట్ల విలువ చేసే స్థలం కబ్జాకు గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్‌కల్ రోడ్డులో సర్వే నంబర్ 1687లో సుమారు 16 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రేడియో స్టేషన్, పీఎఫ్ కార్యాలయం, ఈఎస్ఐ ఆస్పత్రి, వాటర్ ట్యాంక్, పట్టణ మహిళల నిరాశ్రయుల భవనం నిర్మించారు. వాటర్ ట్యాంక్ సమీపంలో సుమారు 1200 గజాల ప్రభుత్వ భూమిలో హరితహారం మొక్కలు నాటారు. అయితే ఇందులో సుమారు 800 గజాలకు సంబంధించి ఒకరు రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించినట్లు తెలుస్తోంది. సుమారు 150 గజాల భూమిని సైతం ఓ సంఘానికి అమ్మకాలు జరిపారు. ఈ ప్రాంతంలో గజం విలువ ప్రస్తుతం రూ.35 వేలు పలుకుతోంది.

ప్రజాప్రతినిధులు, అధికారుల అండతోనే..

ప్రభుత్వ భూమి కబ్జాలో అక్రమార్కుల వెనక ప్రజాప్రతినిధుల అండ ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులు అమ్మేసిన ప్రభుత్వ స్థలంలో ఓ సంఘ భవనానికి ప్రజాప్రతినిధి సైతం రూ. లక్షల్లో అర్థిక సహాయం చేసినట్లు తెలిసింది.

విచారణ చేస్తే వెలుగులోకి..

ప్రభుత్వ స్థలాల కబ్జా విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని న్యాల్‌కల్ రోడ్డులోని స్థానికులు కోరుతున్నారు. విచారణ జరిపితే వాటర్ ట్యాంకు వద్ద ప్రభుత్వ భూమి కబ్జా వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.హరిత హారం మొక్కలను తొలగించి భూ ఆక్రమణకు పాల్పడినా పట్టించుకునే వారు లేరని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం

ఎవరైనా సరే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిపితే కూల్చేస్తాం. ఎవరు కూడా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దు. న్యాల్‌కల్ రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద హరితహారం మొక్కలను తొలగించి నిర్మాణాలు చేపట్టినట్లు దృష్టికి వచ్చింది. పరిశీలనకు వెళ్లి ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. – ఎ కరుణాకర్, టౌన్‌ప్లానింగ్ అధికారి

కంటి వెలుగుపై నిర్లక్ష్యం వహిస్తే వేటు

- సమష్టి కృషితో విజయవంతం చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- బోధన్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. కంటి వెలుగు కేవలం వైద్యారోగ్య శాఖకు సంబంధించినది మాత్రమే కాదని, ఇది అందరి కార్యక్రమమని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో విజయవంతం చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ కంటివెలుగు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు విధులు నిర్వహించడంలో అలసత్వ వైఖరి ప్రదర్శించిన బోధన్ హోమియో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ హైమావతిని సస్పెండ్ చేయాల్సిందిగా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీవోఏలు శిబిరాల నిర్వహణకు పూర్తి సహకారం అందించాలని, శిబిరం ముగిసేవరకూ సెలవులను అనుమతించబోమని కలెక్టర్ స్పష్టంచేశారు. కంటి శిబిరాల బృందాలకు నాణ్యమైన వసతి, భోజన సదుపాయం సమకూర్చాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. శిబిరాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శిబిరాల్లోనే కంటి అద్దాలు, మందులు అందించాలని, క్యాటరాక్ట్ సర్జరీ అవసరమైన వారిని నిజామాబాద్ జీజీహెచ్ ఆస్పత్రికి సిఫారసు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఆడిట్ వివరాలు అప్‌లోడ్ చేయాలి

ఉపాధి హామీ పథకం పనుల ఆడిట్ వివరాలను సంబంధిత పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఏపీవోలను ఆదేశించారు. వచ్చే మంగళవారం నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని గడువు విధించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల కోసం నిర్ణీత గడువులోపు జీపీలు, మండల పరిషత్‌ల తీర్మానాలు పంపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో జయసుధ, మెప్మా పీడీ రాములు, డీఎంహెచ్‌వో సుదర్శనం అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నిజామాబాద్ సిటీ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభోత్సవానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లలో నిమగ్నమైంది. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ(వినాయక్ నగర్) మహిళా భవనంలో గురువారం ఉదయం 9 గంటలకు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, ఆర్డీవో రవి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం ఉన్నారు.

తగ్గేదే లే!

- మాస్టర్ ప్లాన్ రద్దు కోసం కొనసాగుతున్న ఆందోళనలు
- 20న ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడికి పిలుపు
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన రైతు జేఏసీ

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్న పాతరాజంపేట, రామేశ్వరపల్లి, దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, ఇల్చిపూర్, టేక్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాల రైతులు మంగళవారం పాతరాజంపేటలో సమావేశమయ్యారు. ఉద్యమ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. లింగాపూర్‌లో ఈనెల 12న జరిగిన సమావేశంలో విలీన గ్రామాలకు చెందిన 8 మంది కౌన్సిలర్లు రాజీనామాలు చేసి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే.. పాతరాజంపేట్ సమావేశంలో దీనికి డెడ్‌లైన్ విధించారు. విలీన గ్రామాలకు సంబంధించి బీఆర్‌ఎస్‌కు ఆరుగురు, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. వీరు గురువారం వరకు తమ పదవులకు రాజీనామా చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కౌన్సిల్ సమావేశం నిర్వహించి మాస్టర్ ప్లాన్ రద్దు కోసం తీర్మానం చేయాలని కోరుతున్నారు.

లేఖలిచ్చిన బీజేపీ కౌన్సిలర్లు..

ఉద్యమానికి మద్దతుగా ఉంటున్న బీజేపీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ సుతారి రవి, 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్.. రైతుల కోసం తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధమని గతంలోనే ప్రకటించారు. మంగళవారం జరిగిన రైతుల సమావేశంలో రాజీనామాల లేఖలను రైతు జేఏసీ నాయకులకు అందించారు.

ముట్టడి టెన్షన్..

మాస్టర్ ప్లాన్ రద్దు కోసం కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయాలని, లేకపోతే ప్రభుత్వ విప్ ఇంటిని ముట్టడిస్తామన్న రైతుల హెచ్చరికతో టెన్షన్ నెలకొంది. రైతులు కుటుంబ సభ్యులతో సహా సద్దులు కట్టుకుని ముట్టడికి రావాలని పిలుపునిచ్చారు.



ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తున్న రైతు జేఏసీ ప్రతినిధులు

క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైయినీ కలెక్టర్



ఎల్లారెడ్డి: కలెక్టర్ శిక్షణలో భాగంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. కార్యాలయంలో మున్సిపల్ విధుల వివరాలను అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా అన్ని కార్యాలయాలను పరిశీలించి వారు చేసే పనుల గురించి తెలుసుకుంటారని అధికారులు వివరించారు.

క్రీడాకారులకు అభినందన



కామారెడ్డి క్రైం/గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల జరిగిన జాతీయస్థాయి సౌత్ జోన్ సీనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో గాంధారి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన ప్రణీత, సింధు బంగారు పతకాలను సాధించారు. సీనియర్ బాలుర విభాగంలో అభిలాష్ రెడ్డి ద్వితీయ స్థానం పొందారు. జూనియర్ విభాగంలో సాయికృష్ణ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. కోచ్ లక్ష్మణ్ రాథోడ్, జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు సాయి కుమార్, జిల్లా కార్యదర్శి, పోతంగల్ కలాన్ పీఈటీ లక్ష్మణ్, జెడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్స్ డీఎంగా జగదీష్ బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా జగదీష్‌కుమార్ మంగళవారం కొత్త కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంగా ఉన్న డీఎస్‌ఓ చంద్రప్రకాశ్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. జగదీష్ కుమార్ మహబూబ్‌నగర్ డీఎంగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈసందర్భంగా చంద్రప్రకాశ్ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆకట్టుకుంటున్నా.. అనుమతి లేదు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గల జెన్‌కో, జల విద్యుదుత్పత్తి కేంద్ర ఆవరణ ఎంతగానో ఆకట్టుకుంటుంది. కేంద్రం ఆవరణలో పచ్చని చెట్ల మధ్య గల నీటి ఫౌంటేన్, పచ్చని గడ్డిలో అక్షరాలతో లిఖించిన జెన్‌కో, కాకతీయుల కళా తోరణం, పచ్చదనం ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే పర్యాటకులను ఈ జెన్‌కో ఆవరణలోకి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో పర్యాటకులు ఆ ఆహ్లాదాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. ఇప్పటికైనా జెన్‌కో సందర్శనకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పర్యాటకులు కోరుతున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గల జెన్‌కో స్వాగత తోరణం



విద్యుదుత్పత్తి కేంద్ర కార్యాలయ ఆవరణలో ఫౌంటెయిన్..



పచ్చని గడ్డి మధ్య అక్షరాల్లో జెన్‌కో



కేంద్రం ఆవరణలో పైలాన్

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో చాల ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్‌ఎంకు సమాన పనికి సమాన వేతనం, పేస్కేల్ అమలు చేయాలన్నారు. కుటుంబ సభ్యులను సైతం పట్టించుకోకుండా పనులు చేస్తున్నా వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంలు సుజాత, కృష్ణవేణి, పద్మ, రేణుకా, సునిత, జ్యోతి, కవిత, యాదమ్మ, మాధవి, శిరీష, జ్యోతి, బాలమణి, తదితరులున్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

సీఐటీయూ ఆధ్వర్యంలో...

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని పొట్టిగుట్ట తండాలో మంగళవారం పాఠశాల భవనాన్ని, వ్యక్తిగత డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్పీకర్ ప్రారంభించారు. అలాగే సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత ఆలయ ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ సారథ్యంలో జరుగుతోందన్నారు. కుల, మత, జాతి విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరి దాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, బాలరాజు, గిరి, కరీం, కృష్ణారెడ్డి, సాయిబాబా, శ్రీను, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

'సాగర' తీరంలో సాగుకు ఏర్పాట్లు

- బ్యాక్ వాటర్ ప్రాంతంలో..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు భూముల్లో యాసంగిలో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో మండలంలోని జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల శివారు భూములు నీటిలో మునుగుతాయి. ప్రస్తుత సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో యాసంగి ప్రారంభం వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం నిండుకుండల ఉంది. ప్రస్తుతం నీటి విడుదల కొనసాగుతుండటంతో ఇప్పుడిప్పుడే ముంపు నుంచి భూములు బయట పడుతున్నాయి. ఆ భూముల్లో వరి పంటను సాగు చేయడం కోసం అన్నదాతలు సిద్ధమవుతున్నారు. నారు మడులు సిద్ధం చేసి నారు పోస్తున్నారు.

ప్రాజెక్టు నిర్మాణంలో 91గ్రామాలు మునక..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో 91 గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. కొన్ని గ్రామాలు పాక్షికంగా నీట మునిగాయి. ప్రస్తుతం బ్యాక్ వాటర్ నిలిచే భూముల్లో నీరు వచ్చి చేరితే భూములను వదులుకుంటారు. జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల శివారుల్లో సుమారు 100 ఎకరాల్లో బ్యాక్ వాటర్ నిలిచి యాసంగి నాటికి తగ్గుతుంది. కాని సాగు చేసిన పంట చేతికందే భరోసా తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. 2015లో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీరు లేక ఎండిపోయింది. ఆ సమయంలో ప్రాజెక్ట్‌లో అధికంగా శనగ పంటను సాగు చేశారు. కానీ ప్రస్తుత సంవత్సరం అలా సాగు చేసే అవకాశం లేదు. కేవలం బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాల్లోనే సాగు చేసే అవకాశం ఉండటంతో రైతులు ఆ దిశగా కృషి చేస్తున్నారు. ప్రాజెక్ట్ అంచున పంటలు సాగు చేయడంతో నీటి సమస్య ఉండదని రైతులు అంటున్నారు. ఖరీఫ్‌లో మాత్రం ప్రస్తుత సంవత్సరం వేసిన పంటల్లో కూడ నీరు వచ్చి కొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 90 టీఎంసీల నీరు నిల్వ ఉంచిన సందర్భాల్లో ఎక్కువగా భూములు నీట మునిగాయి. అందుకు ప్రాజెక్ట్ అధికారులు 75 టీఎంసీలకు చేరినప్పటి నుంచే గోదావరిలోకి నీటి విడుదలను చేపట్టారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



'ధరణి టౌన్‌షిప్'లో వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల యజమానులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల వెంచర్‌లో సంవత్సరం దగ్గర పడుతున్న ఇప్పటి వరకు వసతులు కల్పించలేకపోయారని తక్షణమే వసతులు కల్పించాలని ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఓపెన్ యాక్షన్ నిర్వహించిన సమయంలో సంవత్సరంలోపు ఈ ధరణి టౌన్‌షిప్‌లో రోడ్డు, విద్యుత్, నీటి తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ప్లాట్లను విక్రయించారని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేరని వాపోయారు. అలాగే మిగిలిపోయిన ఇళ్లు, ప్లాట్లను కొనడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదని, కనీసం ప్లాట్లు కొనుగోలు చేసిన వారి కోసం తక్షణమే అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల యజమానుల కమిటీ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శివ రాజయ్య, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భస్వంత్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోమశేకర్, మోహన్ రెడ్డి, శ్రీధర్, ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు 'కంటివెలుగు'లేవి?

- నేటి నుంచి రెండో విడత ప్రారంభం
- 18ఏళ్లు పైబడిన వారికే కంటి పరీక్షలు
- ప్రభుత్వ తీరుపై విద్యార్థిసంఘాల ఆగ్రహం

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తోంది. బుధవారం నుంచి ఈ కార్యక్రమం మొదలు కానుంది. 70 బృందాలు షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమంలో 18 ఏళ్ల వయస్సు పైబడిన వారికి కళ్లను పరీక్షించి అవసరమైన వారికి అద్దాలు, మందులను పంపిణీ చేయనున్నారు. దీంతో పాఠశాల విద్యార్థులకు కంటి వెలుగు-2లో పరీక్షలు జరిపించకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

మొదటి విడతలో విద్యార్థులకు కూడా..

రాష్ట్రంలో 2018లో నిర్వహించిన కంటి విడత మొదటి విడత కార్యక్రమంలో విద్యార్థులకు కూడా పరీక్షలను నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను సైతం పంపిణీ చేశారు. కానీ రెండో విడత కార్యక్రమంలో విద్యార్థులను పట్టించుకోకపోవడంతో కార్యక్రమాన్ని ప్రభుత్వం రాజకీయ కోణంలోనే చూస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంటి వెలుగు రెండో విడతలో అందరికి కంటి పరీక్షలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



విద్యార్థులకు అవకాశం ఇవ్వాలి..



కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు అవకాశం కల్పించకపోవడం హేయమైన చర్య. కంటి వెలుగు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కంటి వెలుగులో అందరికి పరీక్షలను జరిపించాలి. విద్యార్థులకు ప్రత్యేక సమయం కేటాయించాలి.


– వేణు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్

ఓట్ల కోసమే కంటి వెలుగు..



కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం రాజకీయ కోణంలోనే నిర్వహిస్తుంది. వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే రెండో విడత చేపట్టారు. 18ఏళ్ల వయస్సు నిండని వారికి ఓటు హక్కు లేదనే ఉద్దేశంతోనే కంటి పరీక్షలను నిర్వహించడం లేదు.

– నల్ల నవీన్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నిజామాబాద్



క్రైం కార్నర్

దేశీదారు పట్టివేత



ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ నిందితుడు, దేశీదారు సీసాలు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను సీజ్ చేసినట్లు బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. బోధన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్ర నుంచి షాదుల్లా అనే వ్యక్తిని పట్టుకుని అతని వద్ద 180 ఎంఎల్ 120 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సై బాలయ్య, పీసీలు సంజీవ్, శ్రీనివాస్, సుదర్శన్, ప్రమోద్‌లు పాల్గొన్నారు.

చెరువు కట్ట ధ్వంసంపై కేసు నమోదు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ నాగప్ప చెరువు కట్టను ధ్వంసం చేసి రోడ్డును తన పొలం వద్దకు వేసుకున్న రైతు రాపర్తీ చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నాగప్ప చెరువు కట్టను ధ్వంసం చేసిన విషయాన్ని ఇరిగేషన్ ఏఈ ఆనందం ఫిర్యాదు చేయడంతో తాము ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించామన్నారు. ఈమేరకు కట్టను ధ్వంసం చేసిన రైతు రాపర్తి చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కల్లు విక్రయదారుడిపై ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేట కల్లు దుకాణ విక్రయదారుడు లచ్చాగౌడ్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఇటీవల దుకాణంలో కల్లు సీసాను కొనుగోలు చేసిన ఓ వినియోగదారుడికి సీసాలో కుళ్లిన ఎలుక రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కల్లు విక్రయదారుడితో పాటు కల్లుదుకాణ యాజమానిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో ఒక యువకుడికి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా.. గ్రామంలోని రైతు గడ్డం రాజేశ్వర్ వద్ద గల పసుపు బాయిలర్ మిషన్‌లపై ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట గ్రామానికి చెందిన దౌరి కృష్ణ పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బాయిలర్‌లో నీళ్లు నింపుకోవడానికి శివారులోని మోటారు పంపుసెట్టు వద్దకు కృష్ణ వెళ్లాడు. బాయిలర్‌లో నీళ్లు నింపుతుండగా అతడు ప్రమాదవశాత్తు కేబుల్‌కు తగలడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే స్థానికులు తీవ్ర గాయాలపాలైన కృష్ణను మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని తిరుమల కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన అశోక్ తన తల్లి ఇటీవల మరణించింది. దీంతో ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి మోర్తాడ్ మండలం తిమ్మర్‌గ్రామానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వారు ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉంది. బీరువాలో ఉన్న పన్నెండున్నర తులాల బంగారం, రూ.1లక్ష నగదు, చిన్నారుల ఆట వస్తువులు చోరీకి గురయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

బ్యాంక్‌లో చోరీకి యత్నం

బిచ్కుంద: మండలంలోని శాంతాపూర్‌లోగల తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండుగులు చోరీకి యత్నించారు. దుండగులు తాళం పగలగొట్టి సేఫ్టీ లాకర్ రూంలో ప్రవేశించగా సెక్యూరిటీ అలారం మోగింది. దీంతో అలర్ట్ అయిన బ్యాంక్ మేనేజర్ లతీఫ్ వెంటనే బిచ్కుంద పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపు దొంగలు అక్కడినుంచి పారిపోయినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

బోధన్: ఓ హత్యాయత్నం కేసులో ఇరువురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వంద చొప్పున జరిమానా విధిస్తు మంగళవారం బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌లోని ఆజాంగంజ్ కాలనీకి చెందిన కానుగుల వార్ రమేష్ కుమార్‌కు 2000 సంవత్సరంలో సదాశివనగర్ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన సంధ్యతో పెళ్లి జరిగింది. వీరికి పదమూడేళ్ల కూతురు కీర్తన ఉంది. రమేష్ కుమార్, చెక్కికృాంప్‌కు చెందిన తప్పెట్ల ప్రభుదాస్ స్నేహితులు. రమేష్‌కుమార్ భార్య సంధ్యతో ప్రభుదాస్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన రమేష్ కుమార్ భార్యను పలుమార్లు మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని 2019 మార్చి 19న రాత్రి రమేష్ కుమార్‌ను సంధ్య, ప్రియుడు ప్రభుదాస్‌లు కలిసి నోరు మూసి గొంతును నొక్కి హత్య చేసేందుకు ప్రయత్నించారు. వెంటనే పక్క గదిలో నిద్రిస్తున్న అత్త చంద్రవ్వ, కూతురుకు మెళుకువ రావడంతో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా, గదికి తాళం వేసి ఉండటంతో కేకలు పెట్టారు. దీంతో వారు రమేష్‌కుమార్‌ను వదిలిపెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు రమేష్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కోర్టులో విచారణ జరుగగా.. భార్య సంధ్య, నిందితుడు ప్రభుదాస్‌కు శిక్ష విధిస్తు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కామారెడ్డిలో ఒకరికి మూడేళ్లు..

కామారెడ్డి క్రైం: హత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తికి మంగళవారం కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. వివరాలిలా.. మాచారెడ్డి మండలం సోమార్‌పేట్‌తండాకు చెందిన జరుపుల సంకీ అనే మహిళపై 2017లో హత్యాయత్నం జరిగింది. కుటుంబ గొడవల నేపథ్యంలో సమీప బంధువైన జరుపుల నవీన్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలించి, నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ జరుపగా.. నిందితుడికి మూడేళ్ల జైలు, రూ. 100 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కిరణ్‌కుమార్ తీర్పు వెల్లడించారు.

నేడు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన (03) వాహనాలకు గురువారం ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో 35 గొర్రెల మృతి



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో కుక్కలు దాడిచేయగా 35 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన భూష మధు మంగళవారం ఉదయం గ్రామ శివారులో తన 70 గొర్రెల చుట్టు కంచె కట్టి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఊరకుక్కలు కంచెలోకి చొరబడి గొర్లపై దాడి చేశాయి. ఈ దాడిలో 35 గొర్రెలు మృతి చెందగా మరో 17 గొర్లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారి హన్మంత్‌రెడ్డి గాయపడిన గొర్రెలకు చికిత్స నందించారు. దాదాపు రూ. 2.5లక్షల నష్టం వాటిల్లిందని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌కు చెందిన నీలిమా అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఈనెల 7న ఉదయం నీలిమా తన 19నెలల చిన్నకుమారుడికి ఆరోగ్యం బాగాలేనందున ఆస్పత్రిలో వెళుతానని ఇంటి నుంచి వెళ్లింది. ఇప్పటికీ ఇంకా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈమేరకు భర్త శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.